## క్లుప్తంగా

### ప్రతి రైతుకు ఈకేవైసీ తప్పనిసరి

కలకడ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్నదాతలుకు అందించే ఆర్థిక సహాయం కోసం మండలంలోని అర్హత కలిగిన రైతులు అందరూ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారిణి లావణ్య కోరారు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిషాన్ పథకం ద్వారా రూ.6వేలు, రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.14వేలు మూడు విడతలుగా రైతుల ఖాతాలలో జమ చేస్తారని తెలిపారు. రైతులు తమ పరిధిలోని రైతుసేవా కేంద్రాల్లో ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు.

### మానసికంగా దృఢంగా ఉండాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ శివశంకర్

పీలేరు : విధి నిర్వహణలో గ్రామ సచివాలయ సిబ్బంది మానసికంగా దృఢంగా ఉండాలని ఎంపీడీవో శివశంకర్ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో హైదరాబాద్ నిజాం ఇనిస్టిట్యూట్ వైద్యులు డాక్టర్ రమేష్, డాక్టర్ సంతోష్ గ్రామ సచివాలయ సిబ్బంది ఫిజియోథెరపీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజువారీ విధి నిర్వహణలో ఒత్తిడిని అధిగమించడానికి డాక్టర్ల సూచనలు, సలహాల మేరకు వ్యాయామం చేయాలని సూచించారు.

### సైనిక పాఠశాల విద్యార్థుల ప్రతిభ

కలికిరి: సీబీఎస్ఈ సిలబల్ పదో తరగతి, ప్లస్ టూ ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో కలికిరి సైనిక పాఠశాల విద్యార్థులు పదో తరగతి పరీక్షలు 97 మంది, పాటు ప్లస్ టూ పరీక్షలకు 64 మంది విద్యార్థులు హాజరయ్యారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల సిబ్బంది తెలిపింది. ఫలితాలకు సంబంధించి సీబీఎస్ఈ వెబ్‌సైట్‌లో విద్యార్థి హాల్ టిక్కెట్, తల్లి పేరు, పుట్టిన తేదీ పొందుపరచి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు.

### అలసత్వం వీడండి

పెద్దతిప్పసముద్రం: సచివాలయాల్లో పని చేస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్లు విధుల పట్ల అలసత్వాన్ని విడనాడి గృహ నిర్మాణ పనులను వేగవంతం అయ్యేలా చూడాలని హౌసింగ్ ఈఈ రమేష్‌రెడ్డి, డీఈ వెంకటరెడ్డి సూచించారు. మంగళవారం వారు మండల కేంద్రంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీలకు గృహ నిర్మాణ పనుల కోసం ప్రభుత్వం ద్వారా మంజూరైన అదనపు నగదును మండలంలో 239 మంది లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేసినా ఎందుకు నిర్మాణ పనులు ఎందుకు ఊపందుకోలేదని ప్రశ్నించారు. ఈ సమావేశంలో హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు ఉన్నారు.

### నూతన కార్యవర్గం ఎన్నిక

బి.కొత్తకోట: బైక్ మెకానిక్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. ఏఐటీయూసీకి అనుబంధంగా ఈ కమిటీని పనిచేస్తుంది. గౌరవ అధ్యక్షుడిగా సలీంబాషా, అధ్యక్షుడిగా ఎస్.మాలిక్, ఉపాధ్యక్షుడిగా ధన, వెంకటేష్, రెహమాన్, సలీం, ప్రధాన కార్యదర్శిగా రహంతుల్లా ఖాన్, సహాయ కార్యదర్శులుగా మోదీన్, సలీంబాషా, కోశాధికారిగా అమీర్‌బాషా, మరో పది మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ తెలిపారు.

### అవగాహనతో ఎయిడ్స్ నివారణ


ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

మదనపల్లె రూరల్ : రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణా సంస్థ, విజయవాడ ఆదేశానుసారం, అన్నమయ్య జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని వారపుసంతలో కే.సీ.నటరాజ కళాజాత బృందం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాజాత బృందం వీధి నాటకం ప్రదర్శన ద్వారా హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధి ఎలా సంక్రమిస్తుంది. వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అవగాహనతో ఎయిడ్స్ వ్యాధిని నివారించవచ్చని చెప్పారు. వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపవద్దని, ఎయిడ్స్, క్షయ వ్యాధిగ్రస్తులైన గర్భిణుల నుంచి శిశువుకు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఐసీటీసీ కౌన్సిలర్స్, ఏఆర్‌టీ మెడికల్ ఆఫీసర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

### ఉత్సవాలు ప్రారంభం


బి.కొత్తకోట: మండలంలోని గట్టులో వెలసిన ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయ వార్షిక ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. టీటీడీకి అనుబంధంగా ఉన్న ఈ ఆలయంలో వేడుకలకు పట్టువస్త్రాలు, అక్షింతలను టీటీడీ నుంచి వచ్చే అర్చకులతో ఉత్సవాలు నిర్వహిస్తారు. తొలిరోజు వివిధ పూజలు, హోమాలు జరిపారు. స్వామి విగ్రహానికి విశేష అలంకరణలు చేయగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

# ఇది మల్లెల వేళయని..!

పుష్ప జాతుల్లో మహారాణిలాంటిది మల్లె. వాస్తవానికి వేసవిలో మండుటెండల మధ్య ఏ పూలైనా క్షణాల్లో వాడిపోతాయి. ఒక్క మల్లెలు మాత్రమే మండు వేసవిలో సైతం ధవళకాంతులు విరజిమ్ముతూ సుగంధ పరిమళాలను వెదజల్లుతూ వికసిస్తాయి. జాజులు, పందిరిమల్లె, సన్నజాజి, విరజాజి మల్లెజాతికి చెందిన ఈ పుష్పాలు అందరినీ మంత్రముగ్ధులను చేసేస్తాయి.

- వేసవిలో మల్లెపూల గుభాళింపులే
- మార్కెట్‌ను ముంచెత్తుతున్న మల్లెలు
- పూల జడలకు డిమాండ్

మదనపల్లె సిటీ: మండు వేసవి... ఏప్రిల్, మే నెలలు వచ్చాయంటే మండల ఎండలతో పాటు సువాసనలు వెదజల్లే మల్లెపూల సీజన్ వచ్చేసింది. ఈ సీజన్ నవంబర్ నెల వరకు ఉంటుంది. ముగ్గవల మనసు దోచే గుండు, సన్నజాజి మల్లెలు మార్కెట్‌లో గుభాళిస్తున్నాయి. సువాసనలు విరజిమ్ముతున్నాయి. మనసును కోరికల వైపు మళ్లిస్తున్నాయి. మనసుకు ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి. సువాసన, సోయగాలకు మల్లెపూలు పెట్టింది పేరు. మల్లెల సీజన్ ప్రారంభం కావడంతో అమ్మకాలు జోరందుకున్నాయి. మదనపల్లె, వాల్మీకిపురం ప్రాంతాల్లో వందల ఎకరాల్లో తోటలు విస్తరించి ఉన్నాయి. ఎకరాకు మూడు వేల కిలోల చొప్పున



ప్రతి ఏటా 600 టన్నుల పూల దిగుబడి వస్తుంది.

**రూ. లక్షల్లో వ్యాపారం**

వ్యాపారులు నేరుగా తోటల వద్దకు వెళ్లి పూలు కొనుగోలు చేస్తున్నారు. దీంతో వ్యాపారం లక్షల్లో జరుగుతుంది. దీంతో పాటు బస్సులు, వాహనాల్లో వైఎస్సార్ జిల్లా, కోడూరు, కర్నూలు జిల్లా చాగలమర్రి, తమిళనాడు వేలూరు, తిరుత్తణి ప్రాంతాల నుంచి మల్లెపూలు దిగుమతి చేసుకుంటున్నారు. సాయంత్రం 3 గంటలైతే చాలు మార్కెట్‌లో మల్లెల సందడి ఆరంభమవుతుంది. షాపుల్లో దండలు కట్టి, గుట్టలుగా పోసి విక్రయిస్తున్నారు. కిలో రూ.250 నుంచి రూ.300 వరకు పలుకుతున్నాయి. మూర పూలు రూ.30 వరకు అమ్ముతున్నారు. తోపుడుబండ్లు, గంపల్లో మహిళలు పూలు అమ్ముతున్నారు. ధరలు ఎలా ఉన్నా మహిళలు పూలు కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. వాల్మీకిపురం సన్నజాజిపూలకు మంచి డిమాండ్ ఉంది. పెళ్లిళ్లకు, అలంకరణకు ఈ పూలను ఎక్కువ వినియోగిస్తున్నారు. పెళ్లిళ్ల సీజన్‌తో పాటు ఆలయాల ఉత్సవాలు ప్రారంభం కావడంతో మల్లెపూలకు డిమాండ్ ఏర్పడింది.

**వివిధ డిజైన్లలో పూలజడల**

వేసవి వచ్చిందంటే మల్లెపూల జడలకు మంచి క్రేజ్. చిన్నపిల్లలకు వేసవిలో పూలజడలు కుట్టిస్తారు. దీంతో వ్యాపారులు పూలజడలు వివిధ డిజైన్లలో తయారు చేస్తున్నారు. పూల జడలతో చిన్నారులు ఫొటోలు తీసుకుని భద్రపరుచుకుంటున్నారు.

**ఔషధ సాధనాలుగా మల్లెలు**

మల్లెలు సువాసనలు వెదజల్లడంతో పాటు ఔషధాలుగా ఉపయోగపడతాయి. ఎండలో పని చేసి అలసి వచ్చినవారు కనురెప్పలపై మల్లెలు ఉంచితే ఉపశమనం కలుగుతుంది. సబ్బులు, ఆగరబత్తీలు, సెంట్లు వంటి సుగంధ ద్రవ్యాల తయారీలో మల్లెలు ఉపయోగిస్తారు. కొందరు మల్లెలు నీళ్లలో కలుసుకుని స్నానం చేసి చమట, దుర్వాసనను పోగొట్టుకుంటారు.

**డిమాండ్ ఉంది**



వేసవి వచ్చిందంటే చాలు చిన్న పిల్లలకు పూలజడలు కోసం ఆర్డర్లు వస్తాయి. పిల్లల జడల సైజుల బట్టి వివిధ డిజైన్లు తయారు చేస్తాం. ఇందులో సన్నజాజి, గుండెమల్లెలు ఎక్కువగా వాడుతాము. దీంతో పాటు పెళ్లి కుమార్తెలకు కూడా పూల జడలకు ఆర్డర్లు ఎక్కువగా వస్తాయి. మల్లె జడలకు మంచి డిమాండ్ ఉంది.

–ఎంబీఎస్ బాషా, పూలవ్యాపారి, మదనపల్లె

## నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తాం

గుర్రంకొండ: ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించే మండి యజమానుల లైసెన్స్‌లు రద్దు చేస్తామని వాల్మీకిపురం మార్కెట్ కమిటీ కార్యదర్శి కుమార్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం స్థానిక మార్కెట్ కమిటీ ఉపకార్యాలయంలో టమాటా మండీల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండీలలో రైతుల వద్ద నుంచి జాక్‌పాట్ నిర్వహిస్తూ తమను దోచుకొంటున్నారంటూ ఫిర్యాదులు వచ్చాయన్నారు. వందక్రేట్లకు 20 క్రేట్లు జాక్‌పాట్‌ల పేరుతో రైతుల వద్ద నుంచి అక్రమంగా తీసుకోవడం నేరమన్నారు. గతంలో కుదిరిన ఒప్పందం మేరకు నాలుగు శాతం మాత్రమే కమీషన్లు తీసుకోవాలన్నారు. కొంతమంది పదిశాతం కమీషన్లు వసూలు చేయడంతో పాటు వేలం పాట పాడు


మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ కార్యదర్శి కుమార్‌రెడ్డి

కొన్న మొత్తానికంటే తక్కువగా ధరలు రాసి రైతులకు బిల్లులు ఇస్తున్నారనే ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి మండీలు నిర్వహించే యజమానులకు సంజాయిషీ నోటీసులు జారీ చేసి వారి లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండీల యజమానులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించండి

మదనపల్లె రూరల్ : మండలంలోని అంకిశెట్టిపల్లెలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్.బీ.ఆర్.అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని మాల మహానాడు నాయకులు కోరారు. మంగళవారం మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు గుండామనోహర్ ఆధ్వర్యంలో సర్పంచ్ శరత్‌రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గుండా మనోహర్ మాట్లాడుతూ అంకిశెట్టిపల్లెలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని చాలా కాలంగా స్థానికులు కోరుతున్నారని, విగ్రహ ఏర్పాటుకు అనువైన స్థలం కేటాయిస్తే తాము నిర్మాణ పనులు ప్రారంభించుకుంటామని తెలిపారు. దీనిపై సర్పంచ్ శరత్‌రెడ్డి స్పందిస్తూ.. అంబేద్కర్ అందరికీ ఆదర్శప్రాయుడని, ఆయన విగ్రహం ఏర్పాటుకు పంచాయతీలో సభ్యులందరి సమక్షంలో తీర్మానం చేసి అనువైన స్థలం మంజూరుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మాలమహానాడు మండల అధ్యక్షుడు రామచంద్ర, మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి, కార్యదర్శులు ప్రశాంత్, అమర, శ్రీకాంత్, రేవంత్, రమేష్, రాజేష్, ఉమేష్ పాల్గొన్నారు.

## బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి


మదనపల్లె సిటీ: పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టి, చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే జనాభ గణనలో బీసీ కులగణన చేపట్టాలన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థలో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 52 శాతంకు పెంచాలన్నారు. రిజర్వేషన్లకు రాజ్యాంగ భద్రత కల్పించాలని, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు సవరణ చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ,పార్లమెంటు సీట్లను వంద శాతం పెంచాలన్నారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని, బీసీల అభివృద్ధికి, విద్యాభివృద్ధికి ప్రత్యేక స్కీములను రూపొందించాలని కోరారు. విద్యా,ఉద్యోగ రిజర్వేషన్లను బీసీల జనాభా ప్రకారం 27 శాతం నుంచి 56 శాతానికి పెంచాలని పేర్కొన్నారు.

## రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు దూరం

గుర్రంకొండ: రోడ్డుపై వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఎస్ఐ మధురామచంద్రుడు అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఆటోడ్రైవర్లు, ద్విచక్రవాహనదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనాలు నడిపేవారు తప్పనిసరిగా లైసెన్స్‌లు కలిగి ఉండాలని, వాహనాలు నడిపే సయయంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని అన్నారు. రోడ్లపై బైక్ రేసింగ్‌లు, ఎక్కువ శబ్దాలు చేస్తూ నడిపే వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని అన్నారు. ఆటో డ్రైవర్లు లైసెన్స్‌లు తమ వద్ద ఉంచుకొని ఆటోలు నడపాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, డ్రైవర్లు, వాహన చోదకులు పాల్గొన్నారు.

## వైభవంగా రెడ్డెమ్మతల్లి పునః ప్రతిష్ట అంకురార్పణ

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన సంతాన ప్రదాయిని శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయంలో అమ్మవారి పునఃప్రతిష్ట అంకురార్పణ ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఇటీవల అమ్మవారి ఆలయాన్ని రూ. 2.50 కోట్లతో పునర్ నిర్మించారు. ఇందులో భాగంగా అమ్మవారి నూతన విగ్రహాన్ని ప్రతిష్టించే కార్యక్రమాలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. మొదటి రోజైన మంగళవారం అమ్మవారి ఆలయంలో అంకురార్పణ ఉత్సవాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ప్రతిష్ట


రెడ్డెమ్మతల్లి పునః ప్రతిష్ట అంకురార్పణ కార్యక్రమం

కార్యక్రమ దాతలు బొమ్మిశెట్టి రెడ్డి పరంజ్యోతి, మోడెం వీరాంజినేయప్రసాద్, సర్పంచ్ ప్రేమకుమారి, ఎంపీటీసీ ప్రసాద్‌నాయుడు, ఆలయ ఈఓ మంజుల,సిబ్బంది బాలకృష్ణ, మహేష్‌రెడ్డి పాల్గొన్నారు.

## నేత్రపర్వంగా బుద్ధ పౌర్ణమి వేడుకలు

మదనపల్లె రూరల్: మండలంలోని అంకిశెట్టిపల్లి వద్దనున్న బుద్ధునికొండపై బుద్ధ పౌర్ణమి వేడుకలు నేత్ర పర్వంగా జరిగాయి. తథాగతుడు గౌతమ బుద్ధుని 2,569వ జయంతి పురస్కరించుకుని, బుద్ధ అంబేడ్కర్ సమాజ్, భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) సంయుక్తంగా వేడుకలు నిర్వహించారు . ఈ సందర్భంగా బౌద్ధ ఉపాసకులు బోధివృక్షం చుట్టూ ప్రదక్షిణలు చేసి, పూజలు చేశారు. ఈ సందర్భంగా బుద్ధ అంబేడ్కర్ సమాజ్ ఫౌండర్ ట్రస్టీ పీటీయం శివప్రసాద్, ప్రజాకవి పోతబోలు రెడ్డెప్ప మాట్లాడుతూ బౌద్ధాన్ని అక్కున చేర్చుకున్న దేశాలు వేగంగా అభివృద్ధి చెందుతుంటే, బౌద్ధానికి జన్మనిచ్చిన భారతదేశం బౌద్ధాన్ని దూరం చేసుకుని అభివృద్ధికి నోచుకోలేకపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

**సైనికులకు సంఘీభావం**

ఉగ్రమూకలతో సమరంలో శక్తియుక్తులు ప్రదర్శి


ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఉపాసకులు

స్తున్న త్రివిధ దళాల సైనికులకు బుద్ధ పున్నమి వేడుకల్లో ఉపాసకులు సంఘీభావం ప్రకటించారు. బౌద్ధ ఉపాసకులు నీరుగట్టి రమణ, చాట్ల బయన్న, ముత్యాల మోహన్, మలారి గిరిబాబు, జీ.వి. రమణ, సొన్నికంటి రెడ్డెప్ప, బండకోట రవి, డాక్టర్ గంగాద్రి, రవిశంకర్, వై. గంగాధర్, తలారి కృష్ణ, జనార్దన్, వై. చిన్నా, శశికుమార్, ఉపాసికలు శాంతమ్మ, శంకరమ్మ, గంగులమ్మ, ఈశ్వరమ్మ, నాగమణి, దేవి, సుమలత, లక్ష్మి పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో ఎల్లమ్మ తిరునాల


ఆలయ ప్రదక్షిణలో చాందినీబండి

కేవీపల్లె : మండలంలోని ఎంవీపల్లె పంచాయతీ చీనేపల్లెలో పౌర్ణమిని పురస్కరించుకుని చీనేపల్లె ఎల్లమ్మ తిరునాల రెండో రోజు భక్తి శ్రద్ధలతో జరిగింది. చీనేపల్లెలో వెలసిన చిన్నక్కమ్మ, పెద్దక్కమ్మ అమ్మవార్లకు సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు పూజలు నిర్వహించారు. భక్తులు నవధాన్యాలతో తయారు చేసిన మొలకలు, బోనాలు ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. చాందినీ బండ్లు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

## ఉత్సాహంగా ఉట్లమాను ఉత్సవం


ఉట్లమాను ఉత్సవంలో పాల్గొన్న యువకులు

కురబలకోట: మండలంలోని అంగళ్లు గ్రామం మొలకవారిపల్లెలో మొలకలపౌర్ణమి మారెమ్మ జాతర సందర్భంగా మంగళవారం ఉత్సాహంగా ఉట్లమాను ఉత్సవం జరిగింది. యువకులు పోటీలు పడి ఉట్లమాను ఎక్కారు. చూపరులను ఆకట్టుకున్నారు. ప్రతి ఏటా జాతర సందర్భంగా దీనిని ఆసక్తికరంగా నిర్వహిస్తారు. ఉట్లమాను ఎక్కిన యువకుడికి బహుమతి అందజేశారు. ఉత్సవాన్ని చూడటానికి పరిసర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున జనం తరలివచ్చారు.

## కూలీలందరికీ పని కల్పిస్తాం

గాలివీడు : జాతీయ ఉపాధి హామీ పథకం కింద కూలీలందరికీ పని కల్పిస్తామని ఎంపీడీఓ జవహర్ బాబు పేర్కొన్నారు. మంగళవారం మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల తనిఖీలో భాగంగా అరవీడు గ్రామంలో జరుగుతున్న పెద్దచెరువు కాలువ పూడికతీత పనులను ఆయన అధికారులతో కలసి పరిశీలించారు.

## • కమనీయం.. వెంకన్న రథోత్సవం

మదనపల్లె సిటీ: గోవిందా... గోవిందా అంటూ భక్తులు చేసిన నామస్మరణ ప్రతిధ్వనించింది. భక్తులతో పట్టణ పురవీధులు కిటకిటలాడింది. స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వేంకటరమణ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం బ్రహ్మ రథోత్సవం కమనీయంగా సాగింది. ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేదపండితులు ఉత్సవ మూర్తిని విశేషంగా అలంకరించి మహారథం వద్దకు తీసుకువచ్చారు. వేదపండితులు లక్ష్మణ, అమర, బాలాజీ, గోవర్ధన్ భట్టార్ శాస్త్రోక్తంగా రథం చుట్టూ ప్రదక్షిణలు, పూజలు చేసి రథంపై కొలువుదీర్చి ఉత్సవం ప్రారంభించారు. స్థానిక దేవళంవీధి నుంచి అప్పారావువీధి, నెహ్రూబజార్, దక్నీపేట, ఆర్‌ఈర్‌వీధి, కమ్మవీధి, శాస్త్రివీధుల్లో ఊరేగించారు. ఆలయ మాజీ పాలక మండలి చైర్మన్ బింగి పాండు, ఈఓ రమణతో పాటు పలువురు ప్రముఖులు రథం వద్ద జరిగిన తొలిపూజల్లో


రథంపై ఆశీనులైన ఉత్సవమూర్తులు

పాల్గొని, తర్వాత రథంపై శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం రథాన్ని లాగి భక్తిని చాటుకున్నారు. భక్తులు తమ ఇలవేల్పును దర్శించుకుని రథంపైకి మిరియాలు, పూలు, దవనం చల్లేందుకు గంటల తరబడి వేచి ఉన్నారు. దేవుడికి టెంకాయలు కొట్టి కర్పూరహారతులు ఇచ్చారు. రథోత్సవం పురస్కరించుకుని వన్‌టౌన్ సీఐ ఎరిసావల్లి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

## • చల్లంగ చూడు.. గంగమ్మ తల్లీ

మదనపల్లె రూరల్ : నియోజకవర్గంలోని ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని, సకాలంలో వర్షాలు కురిసి, పంటలు సమృద్ధిగా పండాలని, ప్రతి ఒక్కరినీ గంగమ్మ తల్లి చల్లగా చూడాలని అమ్మవారిని ప్రార్థించినట్లు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ తెలిపారు. మంగళవారం మండలంలోని చీకలబైలు గంగమ్మజాతర అత్యంత వైభవంగా జరిగింది. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ప్రసిద్ధి పొందిన చీకలబైలు గంగమ్మను, స్థానిక నాయకులతో కలిసి నిసార్‌అహ్మద్ దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా నిసార్‌అహ్మద్ మాట్లాడుతూ జాతరలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలన్నారు. గంగజాతర సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇల్లు పండుగ శోభతో, బంధుమిత్రుల సందడితో కళకళలాడుతుంటే...


గంగమ్మకు పూజలు చేస్తున్న నిసార్‌అహ్మద్

మనస్సుకు సంతోషంగా ఉంటుందన్నారు. శక్తి స్వరూపిణి చీకలబైలు గంగమ్మను దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. గ్రామస్తులందరికీ జాతర శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్ర, సర్పంచ్‌లు ఈశ్వరయ్య, బుడ్డన్న, కౌన్సిలర్ ఈశ్వర్‌నాయక్, వేణుగోపాల్,మహేష్, మల్లికార్జునరెడ్డి, యూనస్, చిన్న, చరణ్, శ్రీకాంత్, నరసింహులు, సాదిక్, జబి, నసీర్, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

## • వైభవంగా ఎల్లమ్మ తిరునాల

పెద్దమండ్యం: మండలంలో మొలకల పౌర్ణమి సందర్భంగా శిద్దవరంలో ఎల్లమ్మతల్లి, రెక్కల కొండపల్లెలో మల్లాలమ్మ తల్లి, చదివేవాండ్లపల్లెలో నేలమల్లేశ్వరస్వామి తిరునాల సోమవారం రాత్రి వైభవంగా జరిగాయి. మొలకల పౌర్ణమిని పురష్కరించుకొని భక్తులు ఆలయాల వద్ద భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. రాత్రి జరిగిన వేడుకల్లో శిద్దవరం, రెక్కలకొండపల్లెల్లో తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి తనయుడు అభినయ్‌రెడ్డి, కలిచెర్ల మాజీ సింగిల్ విండో చైర్మన్ కడప సుధాహరరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే చదివేవాండ్లపల్లెలో వెలసిన నేలమల్లేశ్వరస్వామి గుడిలో మాజీ ఎంపీపీ టి. రెడ్డిశేఖరరెడ్డి, మాజీ జెడ్పీటీసీ భ్రమరాంబ, వైస్‌ఎంపీపీ టి. జయచం


ఎల్లమ్మ సన్నిధిలో అభినయ్‌రెడ్డి, నాయకులు

ద్రారెడ్డి కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గుర్రం రమేష్, మండల కన్వీనర్ కన్నప్ప పెద్దరెడ్డెప్పరెడ్డి, ఎంపీటీసీలు మంచూరి జయరాం, బోడెం రవితేజ, జిల్లా యాక్టివిటి కార్యదర్శి బైన మధూకరరెడ్డి, నాయకులు నగిరి కుమార్‌నాయుడు, బోడిమాని రామిరెడ్డి, శిద్దవరం చంద్రారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

## • కనుల పండువగా ఉత్సవాలు

గుర్రంకొండ: మండలంలోని సంగసముద్రం గ్రామదేవత ఒస్కోటమ్మ తల్లి తిరునాల ఉత్సవాలు కనుల పండువగా నిర్వహించారు. మంగళవారం గ్రామంలో మహిళలు అమ్మవారికి బోనాలు, దివిటీలు భక్తిశ్రద్ధలతో సమర్పించారు. మేళతాళాలతో, బాణాసంచా పేల్చుతూ పెద్ద ఎత్తున చాందినీబండ్లు తరలివచ్చాయి. రంగు రంగుల విద్యుద్దీపాలంకరణాతో వచ్చిన చాందినీ బండ్లు అందర్ని ఆకట్టుకొన్నాయి. తిరునాల సందర్భంగా పెద్ద ఎత్తున గ్రామస్తులు అమ్మవారి ఆలయానికి తరలివచ్చి అమ్మవారికి ఘనంగా పూజలు నిర్వహించారు. పలువురు గ్రామస్తులు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

అమ్మవారికి మొక్కులు చెల్లించుకొన్నారు. బంధుమిత్రుల రాకతో పల్లెల్లో జనసందోహంతో సందడి నెలకొంది.

## • ఘనంగా అంకాలమ్మ జాతర

పీలేరురూరల్ : మండలంలోని వేపులబైలు పంచాయతీ జంగంపల్లెలో అంకాలమ్మ అమ్మవారి జాతర అంగరంగ వైభవంగా నిర్వహించారు. సోమవారం రాత్రి నుంచి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున మహిళా భక్తులు అమ్మవారికి దీలు, బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. మంగళవారం ఉదయం సాంస్కృతిక కార్యక్రమాల నడుమ చాందినీబండ్ల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు.


పూజలందుకుంటున్న అంకాలమ్మ తల్లి

# మహిళల ఉజ్వల భవితకు ‘కిశోరి వికాసం’


మదనపల్లె రూరల్ : కిశోరి వికాసంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ సుజాత


పెద్దతిప్పసముద్రం: మాట్లాడుతున్న సూపర్‌వైజర్ నాగరత్నమ్మ


పీలేరు : బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేస్తున్న డాక్టర్లు, సిబ్బంది

మదనపల్లె రూరల్ : యుక్త వయస్సులో ఉన్న బాలికలు, మహిళల ఉజ్వల భవిష్యత్తుకు ‘కిశోరి వికాసం’ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని సీడీపీఓ సుజాత అన్నారు. మండలంలోని బొమ్మన చెరువు పీహెచ్‌సీ ఆవరణలో కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ సుజాత మాట్లాడుతూ బాలికలకు నిత్యజీవితంలో సమాజంలో ఎదురయ్యే సమస్యలపై అవగాహన కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కిశోరి వికాసం పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించిందన్నారు. మే 2 నుంచి జూన్ 10వ తేదీ వరకు మహిళా, శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో వార్డు, గ్రామసచివాలయాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్య, నైపుణ్యం, ఎదుగుదల, పోటీతత్వం, వ్యక్తిగత శుభ్రత వంటి 12 అంశాలపై బాలికలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. షెడ్యూల్‌లో నిర్ణయించిన విధంగా మే 13న బాలల హక్కులు, రక్షణ, పోక్సో చట్టం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పోక్సో చట్టం 2012లో భారతదేశంలో ఆమోదించబడిందని, లైంగిక వేధింపుల నుంచి పిల్లలకు రక్షణ కల్పించేందుకు రూపొందించినట్లు తెలిపారు. 18 ఏళ్లలోపు పిల్లలందరికీ ఈ చట్టం వర్తిస్తుందన్నారు. ఈ చట్టం కింద లైంగిక వేధింపులకు పాల్పడిన వారిపై కఠినమైన శిక్షలు విధించడం జరుగుతుందన్నారు. కిశోర బాలికలు తీసుకోవాల్సిన ఆహారం, రక్తహీనత సమస్యలపై, పాటించాల్సిన జాగ్రత్తలపై వివరించారు. పీహెచ్‌సీ డాక్టర్లు, మహిళా పోలీస్, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రకాంత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**బాలల హక్కులు, చట్టాలపై అవగాహన**

పెద్దతిప్పసముద్రం: మండలంలోని తుమ్మరకుంట అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం బాలల హక్కులు చట్టాలపై ఐసీడీఎస్ అధికారులు అవగాహన కల్పించారు. కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా బాలల హక్కులు, సంరక్షణ, బాలల మనుగడ, 18 ఏళ్ల వయసు లోపు బాల, బాలికల సార్వత్రిక హక్కులు, అఘాయిత్యాలు, ఫోక్సో చట్టాలపై సూపర్‌వైజర్ నాగరత్నమ్మ, మహిళా పోలీస్ పావని అవగాహన కల్పించారు.

**విజయవంతం చేయండి**

రామసముద్రం: మదనపల్లె ప్రాజెక్టు పరిధిలో రామసముద్రం మండల చెంబకూరు పంచాయతీలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర వికాసం కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సీడీపీవో సుజాత హాజరై మాట్లాడుతూ ఈ కార్యక్రమం మే నెల 3వ తేదీ నుంచి జూన్ 10వ తేదీ వరకు అన్ని పంచాయతీలలోను షెడ్యూల్ ప్రకారం నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే పోక్సో కేసులు, బాల్యవివాహాలు, రక్తహీనత గురించి తెలియజేశారు. మహిళా పోలీస్ రేవతి, సూపర్‌వైజర్లు శాంతమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కిశోర బాలికల పట్ల నిర్వహించవలసిన రోజువారి కార్యక్రమాలపై బీపీసీ కల్యాణి కార్యకర్తలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**బాల్య వివాహాలు శ్రేయస్కరం కాదు**

పీలేరు : సరైన వయస్సులో వివాహం మంచి దాంపత్యానికి పునాదిలాంటిదని డాక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని జాండ్లలో ‘బాల్య వివాహాలు – అనర్థాలు’ అంశంపై కిషోర బాలికలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇద్దరు వయోజనులైన భాగస్వాములు మధ్య హక్కులు బాధ్యతలను సూచించే చట్టపరమైన ఒప్పందం వివాహమని తెలిపారు. బాల్య వివాహాలు శ్రేయస్కరం కాదని తెలిపారు. బాల్య వివాహాలు చేసుకుంనే కాన్పును తట్టుకునే శక్తి లేక, బిడ్డలను పెంచే నైపుణ్యం లేక ఇబ్బందులు ఎదురవుతాయని చెప్పారు. బాల్య వివాహాలు జరగకుండా తమ వంతు సహకరిస్తామని బాలికలచే ప్రతిజ్ఞ చేపించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వై. నీలిమ, హెచ్ఈ కొండయ్య, పర్యవేక్షకులు ఉమ, ఏఎన్ఎం రెడ్డిబీ, కృష్ణమ్మ, మహిళా పోలీసులు భాగ్యలక్ష్మి, దివ్య పాల్గొన్నారు.